ఇంటి నుండి పరారైన వ్యక్తి..

తిరుమలలో పట్టివేత



ప్రజాశక్తి -తిరుమల: వరంగల్ జిల్లాకు చెందిన ఓ వ్యక్తి ఆర్థిక సమస్యలతో ఇంట్లో నుంచి పరారయ్యాడు. హనుమకొండలో నివాస మంటున్న లక్ష్మణ్ దాస్ అట్టల్ (59) అనే వ్యక్తి తన కుటుంబంలో ఆర్థిక సమస్యలు రావడంతో తన ఇంటిని వదలి వచ్చేశాడు. దీంతో కుటుంబ సభ్యుల మేరకు హనుమకొండ పోలీసులు ఫిర్యాదు తీసుకొని గాలింపు చర్యలు చేపట్టారు..తీరా లక్ష్మణ్ దాస్ అట్టాల్ విమానంలో ప్రయాణించి తిరుపతికి చేరుకున్నట్లుగా హనుమకొండ పోలీసులు తెలుసు కున్నారు. తిరుపతి నుంచి ప్రత్యేక కారు ద్వారా లక్ష్మణ్ తిరుమలకు చేరుకున్నాడు. అనంతరం తిరుమల నుంచి రోడ్డు మార్గం ద్వారా లక్ష్మణ్ అలిపిరి కాలిబాట మార్గం ఆంజనేయ స్వామి ఆలయం వద్ద దిగిపోయాడు. పోలీసుల సమాచారం మేరకు కాలినడకన తిరుమలకు వస్తోన్న లక్ష్మణ్‌ను విజిలెన్స్ అధికారులు గుర్తించారు. అనంతరం ఏవిస్వో శివయ్య లక్ష్మణ్ ను వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు..

జగన్.. ఎన్నికల హామీని మర్చిపోయారా..?

- నిర్బంధాలతో ఉద్యమాలను ఆపలేరు
- సిఐటియు తిరుపతి జిల్లా ప్రథమ మహాసభల్లో వక్తలు
- మున్సిపల్ కార్యాలయం నుంచి భారీ ర్యాలీ
- ప్రారంభమైన మహాసభలు

ప్రజాశక్తి-తిరుపతి

అధికారంలోకి వచ్చిన మూడు నెలల లోపు కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులందరినీ పర్మినెంట్ చేస్తానని ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీని మరిచిపోయారా... జగన్మోహన్ రెడ్డి అంటూ సిఐటియు నేతలు ప్రశ్నించారు. నిర్బంధాలతో ఉద్యమాలను ఆపలేరని హెచ్చరించారు. ఉద్యోగ, కార్మికులకు అండగా ఎప్పుడూ ఎర్రజెండా ఉంటుందని ప్రకటించారు. సిఐటియు తిరుపతి జిల్లా ప్రథమ మహాసభలు వేడుకగా ఆదివారం ప్రారంభమైంది. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం నుంచి రామ తులసి కల్యాణ మండపం వరకు ఎర్రజెండాలు చేతబట్టి వేల కార్మికులు భారీ ర్యాలీని నిర్వహించారు. అనంతరం నిర్వహించిన ప్రారంభ సభకు ముఖ్య అతిథులుగా హాజరైన సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ నర్సింగరావు మాట్లాడుతూ... దేశాభివృద్ధిలో కీలక భూమిక పోషిస్తున్నది కార్మికులేనని అన్నారు. సర్వసంపదను సృష్టించేది కార్మికవర్గమేనని అలాంటి వారి పట్ల నిర్బంధ కాండను కొనసాగిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరును తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. లేబర్ కోడ్‌ను తీసుకొచ్చి సమ్మె



మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు అజయ్‌కుమార్



వేదికపై మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ నర్సింగరావు

చేయకూడదు.. సంఘం పెట్టకూడదంటూ కార్మిక వర్గాన్ని అణచివేసేందుకు సకల విధాలా ప్రయత్నిస్తుండటం దుర్మార్గమన్నారు. నల్ల చట్టాలను తీసుకొచ్చి రైతులపై అంక్షలు మోపితే వచ్చిన తిరుగుబాటును మర్చిపోవద్దంటూ కేంద్రాన్ని హెచ్చరించారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అంటూ కార్పొరేట్లకు తొత్తులుగా ప్రభుత్వాలు మారిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సరళీకరణ విధానాల పేరుతో ప్రభుత్వ సంస్థలను నిర్వీర్యం చేస్తూ ప్రైవేటీకరణ చేస్తోందంటూ ధ్వజమెత్తారు. 200 ఏళ్ల చరిత్ర ఉన్న రైళ్లను ప్రైవేటుపరం చేయడం, విశాఖ స్టీల్ ప్లాంట్‌ను సైతం ప్రైవేటు వ్యక్తులకు అప్పగించేందుకు సిద్ధమవడమే దీనికి నిదర్శనమన్నారు. ప్రభుత్వాలు, పార్టీలు, నాయకులు, మారుతున్నా.. కార్మికుల జీవితాల్లో మాత్రం మార్పు రావడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మోడీ అధికారంలోకి రాకముందు గ్యాస్ ధర రూ.400 ఉంటే ఇప్పుడు రూ.1200కి పెరిగిందన్నారు. ఇలాంటి తరుణంలో ఐక్యపోరాటాలు అవసరమని, ఉద్యోగ, కార్మికిలు, రైతులు, యువత, విద్యార్థులు, మహిళలు, ప్రజలు ఆ దిశగా పోరాడాలని పిలుపునిచ్చారు.

సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు అజయ్ కుమార్ మాట్లాడుతూ..రోజురోజుకీ కార్మికుల జీవన ప్రమాణాలు తగ్గిపోతుంటే నిత్యవసర వస్తువుల ధరలు మాత్రం ఆకాశాన్ని అంటుతున్నాయన్నారు. 90 శాతం కార్మికులకు నేటికీ పిఎఫ్, ఈఎస్ఐ లాంటి సౌకర్యం అందడం లేదని అన్నారు. అయినా తమకేమీ పట్టనట్లు అటు ప్రభుత్వం, ఇటు లేబర్ అధికారులు వ్యవహరిస్తున్నారని చెప్పారు. కనీస వేతన చట్టం అమలు కోసం ఏళ్లతరబడి పోరాడాల్సి వచ్చిందని వాపోయారు. నేటికీ పూర్తిస్థాయిలో ఇంకా అమలకు నోచుకోలేదని అన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోర్టులు మొట్టికాయలు వేస్తున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పైగా ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు నిర్బంధాలను ప్రయోగిస్తూ కార్మికుల గొంతు నొక్కేస్తున్నారన్నారు.

సిఐటియు తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి మాట్లాడుతూ... పాదయాత్ర సందర్భంగా తిరుపతికి వచ్చిన జగన్మోహన్ రెడ్డి తాను అధికారంలోకి వచ్చిన మూడు నెలల లోపు కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ కార్మికులందరినీ పర్మినెంట్ చేస్తారని హామీ ఇచ్చారని చెప్పారు. అయితే అధికారంలోకి వచ్చి మూడున్నర ఏళ్ళు అవుతున్న పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. టిటిడి చైర్మన్‌గా ఉన్నటువంటి జగన్ చిన్నాన్న వైవి సుబ్బారెడ్డి ఇప్పటికి పది సార్లు పైగా ఉన్న కార్మికులందరినీ పర్మినెంట్ చేస్తామని హామీలు గుప్పించి తీరా కార్పొరేషన్ లో విలీనం చేస్తుండటం దారుణం అన్నారు. టిటిడి బోర్డులో నిర్ణయించిన తీర్మానాలను సైతం అమలు చేయకుండా టీటీడీ అటవీ కార్మికులపై వివక్ష చూపుతున్నారని చెప్పారు. 760 రోజులుగా నిరాహార దీక్షలు చేస్తున్న అటవీ కార్మికుల పట్ల ఏమాత్రం మానవత్వం లేకుండా వ్యవహరిస్తూ వారిలో చెవిరెడ్డి భాస్కర్ రెడ్డికి అనుకూలంగా ఉన్న 162 మందిని మాత్రం పర్మనెంట్ చేయడం ధర్మమేనా అంటూ ప్రశ్నించారు. రాజ్యాంగం కల్పించిన హక్కుల్ని, భావ ప్రకటనా స్వేచ్ఛను హరిస్తూ నిర్బంధాన్ని మోపుతున్నారని అన్నారు. కార్మికుల గొంతుకగా ఉన్న ఎర్రజెండా నేతల కార్యకలాపాలపై నిఘా ఉంచడానికే పోలీసుల ఉద్యోగాలు అన్నట్లు వ్యవహరించడం భావ్యం కాదన్నారు. నిత్యం హిందూత్వం గురించి మాట్లాడే నాయకులకు టిటిడిలో ఉన్న పేద హిందువుల ఆర్తనాదాలు, ఆకలి కేకలు కనిపించడం లేదా అంటూ ప్రశ్నించారు. ఇలాంటి తరుణంలో పోరాడితేనే సమస్యలు పరిష్కారం అవుతాయని ఉద్ఘాటించారు. ఈ సమావేశానికి సిఐటియు జిల్లా అధ్యక్షులు మల్లారపు నాగార్జున అధ్యక్షత వహించగా చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.చైతన్య సౌహార్ద సందేశాన్ని ఇచ్చారు. సమావేశం ప్రారంభంలో సిఐటియు నేత కేఎస్ఎన్ ప్రసాద్ రావు ఇటీవల కాలంలో మృతి చెందిన పలువురికి సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. సిఐటియు జిల్లా కోశాధికారి జి.బాలసుబ్రమణ్యం కార్మికుల సమస్యల పరిష్కారం కోసం తీర్మానాన్ని ప్రవేశపెట్టగా తుఫాను బాధితుల ప్రజలను ఆదుకోవాలని ఆ సంఘం నేత అంగేరి పుల్లయ్య ప్రవేశపెట్టిన తీర్మానాన్ని సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ మహాసభల్లో సిఐటియు నాయకులు జి.వెంకటేశం, టి.సుబ్రమణ్యం, అంగేరి పుల్లయ్య, ఆర్ లక్ష్మి, వెంకటేష్, గండికోట బాలాజీ, రమేష్, గురవయ్య తదితరులు పాల్గొన్నారు.



మహాసభకు హాజరైన ప్రతినిధులు



ర్యాలీలో పాల్గొన్న నాయకులు



ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో పాటలు పాడుతున్న కళాకారులు

జెండా ఆవిష్కరించిన సీనియర్ నేత మోహన్ రావు



పతాకావిష్కరణ చేస్తున్న సిఐటియు మాజీ అధ్యక్షులు, సీనియర్ నాయకులు పి. మోహన్ రావు తదితరులు

సిఐటియు జిల్లా ప్రథమ మహాసభల ప్రతినిధుల సభ ప్రారంభానికి ముందు సిఐటియు జెండాను ఆ సంఘం సీనియర్ నేత ఇ.మోహన్ రావు ఆవిష్కరించారు. కార్మిక పక్షపాతిగా ఉన్న ఎర్రజెండా ఎప్పుడూ ఉద్యోగ కార్మికులకు అండగా ఉంటుందని , పోరాటాలతోనే సమస్యలు పరిష్కారమవుతాయని ఉద్ఘాటించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాతో పాటు తిరుమల తిరుపతి దేవస్థానంలో అనేక పోరాటాలు విజయవంతం కావడమే దీనికి నిదర్శనమన్నారు. సీఐటీయూ పోరాట ఫలితంగానే టిటిడి వేలాది మంది కార్మికులు పర్మనెంట్ అయ్యారని గుర్తుచేశారు. అదే స్ఫూర్తితో ప్రస్తుతమున్న కార్మికులు తమ హక్కుల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు.

ప్రారంభమైన ప్రతినిధుల సభ



కార్యదర్శి నివేదికను ప్రవేశపెడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి, ప్రారంభమైన ప్రతినిధుల సభ

కామ్రేడ్ దస్తగిరి నగర్ (ఎంబి భవన్)లో ప్రతినిధుల సభ ఆదివారం సాయంత్రం ప్రారంభమైంది. ఆ సంఘం జిల్లా అధ్యక్షులు ఎం నాగార్జునతో పాటు మరో నలుగురు అధ్యక్ష వర్గంగా ఏర్పడి ప్రతినిధుల సభను ప్రారంభించారు. దీనికి ముఖ్య అతిథులుగా హాజరైన సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ నర్సింగరావు, ఉపాధ్యక్షులు అజయ్ కుమార్‌లు ప్రారంభ ఉపన్యాసం చేసి శ్రేణులకు దిశా నిర్దేశనం చేశారు. అనంతరం జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టారు. గత మహాసభల నుంచి ఇప్పటి వరకు సిఐటియు నిర్వహించిన వివిధ, కార్యక్రమాలు, పోరాటాలు ఫలితాలను, భవిష్యత్ కార్యాచరణ చర్చను ప్రణాళికను వివరించారు. ఈ సభలో 300 మందికి పైగా ప్రతినిధులు పాల్గొన్నారు.

శేషగిరులే హిమాద్రిగా మారినవేళ..!

భక్తులకు ఆహ్లాదకర వాతావరణం



ప్రజాశక్తి- తిరుమల: తెల్లని పొగమంచు తెరల నడుమ, చలచల్లని మలయ వీచికలు గిలిగింతలు పెడుతుంటే తిరుమలకు ఇచ్చేసే అసంఖ్యాక భక్తులకు క్రొంగొత్త అనుభూతిని కల్గిస్తూ శేషగిరులలోనే హిమగిరులను కూడా దర్శించుకొనే మధురానుభూతిని ప్రకతీమాత కల్పిస్తున్నది. గత రెండురోజులుగా తిరుమలలో కురుస్తున్న వర్షాలకు శేషగిరులలో వెలసివున్న అనేకానేక పుణ్యతీర్థాలు, జలపాతాలు జలకళతో ఉట్టిపడుతూ భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఎత్తైన కొండచరియల నుండి ఎగసిఎగసి పడుతున్న ఈ జలపాతాలను తిలకించడానికి భక్తులు ఎంతో ఉత్సుకతను ప్రదర్శిస్తున్నారు.

తిరుమలలోని వక్షసంపద, వివిధ వర్ణాలతో కూడిన పుష్పాలు, అరుదైన ఔషధీమొక్కలు మొదలైనవి వర్షపు బిందువులకు సరికొత్త హంగులను సంతరించుకొని పచ్చదనంతో చూపరులను అలరిస్తున్నాయి. కాగా తిరుమలలో గత రెండు రోజులుగా మండాస్ తుఫాను కారణంగా 210 ఎం.ఎం. వర్షం నమోదు అయిందని అధికారులు తెలిపారు. తిరుమలలోని ఆకాశ గంగా, పాపనాశం, గోగర్భం డ్యాం, కుమార ధర మరియు పసుపుధార జలాశయాలు జల కళతో ఉట్టి పడుతున్నాయి. అదేవిధంగా అక్కగార్ల గుడి వద్ద కురుస్తున్న జలపాతాలు, చెక్ డ్యాంల గుండా ప్రవహిస్తున్న నీటిని, ప్రకతి రమణీయ దశ్యాలను యాత్రికులు తమ సెల్‌ఫోన్లలో బంధిస్తున్న దశ్యాలు ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి.

జీతమిచ్చి బదిలీ చేస్కో సామీ..!!

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : భావితరాలను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో అకుంఠిత దీక్షతో పనిచేసే ఉపాధ్యాయులకు సరిగ్గా జీతాలిచ్చి, ఆనక బదిలీలు చేసుకుంటే సబబుగా ఉంటుందని తెలుగు నాడు విద్యార్థి సమాఖ్య మాజీ రాష్ట్ర కార్యదర్శి, బిసి వెల్ఫేర్ జెఎసి రాష్ట్ర కార్యదర్శి డా.యం.ఉమేష్ రావు ఆదివారం ఒక ప్రకటనలో జగన్ ప్రభుత్వానికి హితవు పలికారు. ప్రస్తుత విద్యా సంవత్సరానికి సంబంధించిన అర్ధ సంవత్సర పరీక్షలు మరికొన్ని రోజులలో ప్రారంభం కాబోతుండగా, ఇప్పుడు బదిలీల షెడ్యూల్ ప్రకటించడం అసంబద్ధమైన చర్యని విమర్శించారు. నెలంతా కష్టపడి జీతం కోసం ఎదురుచూసే ఉద్యోగికి నలభై రోజులైనా తన కష్టార్జితం చేతికి అందకుండా నానాఅవస్థలు పడుతుంటే, ఉపాధ్యాయ వర్గాల బదిలీల ప్రక్రియకు షెడ్యూల్ ప్రకటించిన జగన్మోహన్ రెడ్డి చర్యలను చూసి నవ్వాలో, ఏడవాలో తెలియని అయోమయ స్థితిలో ఉద్యోగ వర్గాలు ఉన్నాయని ఉమేష్ ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే నెల అంటే ముప్పై రోజులు అనే అర్థం పోయి నలభై ఐదు రోజులు అని అనుకునేలా జగన్మోహన్ రెడ్డి చర్యలున్నాయని ఉమేష్ ఎద్దేవా చేశారు.

ఘనంగా వనభోజనోత్సవం



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: స్థానిక భరద్వాజ తీర్థంలో శ్రీకాళహస్తీశ్వర క్షేత్ర పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఆదివారం వనభోజనోత్సవం" ఘనంగా జరిగింది. ట్రస్టు బోర్డు చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్థ చేపడుతున్న ధార్మిక కార్యక్రమాల్లో ఓ సభ్యుడిగా పాలుపంచుకోవడం తన అదృష్టమన్నారు. వనభోజ నోత్సవాలు మత సామరస్యానికి, సమానత్వానికి ప్రతీకగా నిలు స్తాయన్నారు. అలాంటి కార్యక్రమాలతో ముందుకెళ్తున్న శ్రీకాళహస్తీశ్వర క్షేత్ర పరిరకక్షణ సమితి అధ్యక్షుడు అట్ల పురుషోత్తం గౌడ్‌ను అభినందించారు. శ్రీకాళహస్తీశ్వర క్షేత్ర పరిరకక్షణ సమితి సూచనల మేరకు ఆలయంలో భక్తులకవసరమైన సౌకర్యాలు కల్పి స్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు బి.వెంకయ్య, కుసుమ గణేష్, పి.రమేష్, నాగరాజశెట్టి, ఉదయగిరి మోహన్, చంద్రశేఖర్, పరమేశ్వరయ్య, రమణయ్య పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ శాకాహారులు కావాలి



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : ప్రతి మనిషి శాకాహారి కావాలని మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు సూచించారు. బ్రహ్మర్షి పితామహ పత్రీజీ ఆశయ సాధనలో భాగంగా ఏడు గంగమ్మల జాతర పురస్కరించుకొని శ్రీకాళహస్తి పట్టణంలో ఆదివారం శాకాహార ర్యాలీ నిర్వహించారు. స్థానిక పొన్నాలమ్మ గుడి నుంచి ప్రారంభమైన ర్యాలీని మాజీ ఎమ్మెల్యే ఎస్‌సివి నాయుడు ప్రారంభించారు. ప్రతి మనిషి శాకాహారి కావడంతో పాటు, ధ్యానం అలవాటు చేసుకొని తనను తాను తెలుసుకోని జీవితాన్ని చరితార్థకం చేసుకోవాలన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం జరిగింది.

ఆస్తుల, పంటనష్టానికి చెందిన

అంచనాలు పకడ్బందీగా సిద్ధం చేయాలి : మంత్రి పెద్దిరెడ్డి

పారిశుధ్య పునరావాస చర్యలు కొనసాగుతున్నాయి: కలెక్టర్



ప్రజాశక్తి- తిరుపత బ్యూరో: మండోస్ తుపాను నేపథ్యంలో రాష్ట్ర అటవీ విద్యుత్తు భూగర్భ గనులశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తిరు పతి, చిత్తూరు అన్నమయ్య జిల్లాల కలెక్టర్లతో తుపాన్ కారణంగా భారీవర్షాలతో జిల్లాలో వాటిల్లిన పంట ఆస్తి నష్ట వివరాలను బాధితుల పునరావాస చర్యలపై, పంటలు, ఆస్తినష్ట అంచనాలపై తీసుకుం టున్న చర్యలపై వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ కె.వెంకట రమణారెడ్డి సంబంధిత అధికారు లతో హాజరయ్యారు. ఈసందర్భంగా ఆదివారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి మాట్లా డుతూ తుపాన్ ప్రభావంపై ఎప్పటికప్పుడు ముఖ్య మంత్రి వైఎస్ జగన్ సమీక్షిస్తున్నారని, షెల్టర్స్‌లో ఉన్న వారికి, ఇల్లులు దెబ్బతిన్న వారికి సత్వరం సహాయం అందించే చర్యలు చేపట్టాలన్నారు. ఇంతవరకు అధికారులు పూర్తి అప్రమత్తతతో పనిచేశారని పంట, ఆస్తి నష్ట పరిహారం కోసం అంచనాలు పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్లకు పలు సూచనలు సలహాలు ఇచ్చి దిశా నిర్దేశం చేశారు. జిల్లా కలెక్టర్ మంత్రికి వివరిస్తూ రాష్ట్రంలోనే తిరుపతి జిల్లాలో అత్యధిక వర్షపాతం 10వ తేదీ ఉదయం వరకు నమోదైందని, మొత్తం 34 మండలాలలో దాదాపు 200 ఎం.ఎం కంటే ఎక్కువగా 10 మండలాల్లో, 150 ఎం.ఎం కంటే మించి 20 మండలాల్లో వర్షపాతం నమోదైందని తెలిపారు. నేటి ఉదయం నుంచి కొంచెం తగ్గుముఖం కనపడుతోందని, శ్రీకాళహస్తి, సూళ్ళూరుపేట, గూడూరు మూడు డివిజన్లకు చెందిన మండలాలలో అత్యధిక వర్షపాతం నమోదయిందని, కొన్ని చోట్ల కాజ్వేలు పొంగి ప్రవహిస్తున్నాయని అక్కడ రెవెన్యు, పోలిస్ యంత్రాంగాన్ని సిద్దంగా ఉంచి అక్కడ ఎవ్వరూ కూడా వాహన దారులను రానియ్యకుండా చూస్తున్నా మన్నారు. అలాంటి వాటికి రహదారికి సంబంధించి అంచనాలు వరదనీటి ప్రవాహం తగ్గినాక అంచనాలు పంపుతామన్నారు. ఎక్కడా ఎటువంటి మానవ ప్రాణ నష్టం ఇప్పటివరకు జరగలేదని, పెద్దజంతువులు ఎద్దులు ఆవులు 7, గొర్రెలు మేకలు 7 చనిపోవడం జరిగిందని అన్నారు. ఆస్తి నష్టానికి సంబంధించి పూర్తి వివరాలు ఇంకా తెలియలేదని, రెవెన్యూ యంత్రాంగం, సంబంధిత శాఖలు వీటిపై సర్వే మొదలు పెట్టారని రేపటి నుండి పూర్తిగా అంచనాల నివేదికలు తయారు చేయనున్నారని తెలిపారు. ఇప్పటి వరకు నాలుగు ప్రదేశాల్లో బాలాయపల్లి, రేణిగుంట, తడ, తిరుపతిలలో రిలీఫ్ క్యాంప్స్ పెట్టడం జరిగిందని, ఇప్పటివరకు 571 మందిని సురక్షితంగా రిలీఫ్ కేంద్రాలకు తరలించి వారికి ఆహారం, నీరు సరఫరా చేయడం జరుగుతోందని తెలిపారు. అలాగే బాలాయపల్లి, రేణిగుంట రిలీఫ్ కేంద్రాల నుంచి ప్రజలు వారి నివాసాలకు వర్షం పరిస్థితి తగ్గాక వెళ్లడంతో మూసి వేశామని అన్నారు.



తిరుపతి కాలనీలో సుమారు 50 ఇళ్ళలోకి నీరు చేరడంతో వారికి తమిళ స్కూల్‌లో ఒక రిలీఫ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసి 70 మంది వరకు తరలించి వారికి కావలసిన అవసరాలను చూస్తున్నామన్నారు. తిరుపతి నగరంలో గతంలో వచ్చిన వరదల అనుభవంతో నగరంలో అన్ని చోట్ల ఎక్కడ నీటిప్రవాహం ఉంటుందో అక్కడ నీటిని నిలబడకుండా ఫ్లో అయ్యేలా డ్రైనేజీ వ్యవస్థపై ఎప్పటికప్పుడు మునిసిపల్ అధికారులతో చర్యలు చేపట్టామన్నారు. ఎటువంటి రోగాలు ప్రబల కుండా సానిటేషన్ చేయవలసినదిగా మునిసిపల్ అధికారులను, డిపిఓకు ఆదేశాలు ఇవ్వడం జరిగిందని వాటి చర్యలు క్షేత్రస్థాయిలో కొనసాగుతున్నాయని తెలిపారు. డిఎంహెచ్‌ఓను ఆరోగ్య శాఖాధికారులను అత్యవసరసమయాల్లో అందుబాటులో ఉండవలసినదిగా ఆదేశించామన్నారు. అలాగే మెడికల్ క్యాం ఏర్పాటు చేశామని, వర్షాలకు ముందుగా అన్ని నీటిట్యాంకులు నీటితో నింపి క్లోరినేషన్ చేశామని, రక్షిత తాగునీరు అందిస్తున్నా మన్నారు. ప్రధానంగా అరణియార్, కాళంగి, మల్లెమడుగు, కల్యాణి డ్యాం వీటిని కూడా ప్రతిక్షణం మానిటర్ చేయడం జరుగుతోందని తెలిపారు. విద్యుత్తు శాఖకు సంబంధించి 33 కేవీ, 11 కేవీ, పోల్ డామేజి అయిన వాటిని పునరుద్ధరించడం జరిగిందనీ అన్నారు. సమావేశంలో డిఆర్‌ఓ శ్రీనివాసరావు, ఆర్డీవో కనక నరసారెడ్డి, ఆర్అండ్ బి జిల్లా అధికారి సుధాకర్‌రెడ్డి, ఎలక్ట్రిసిటీ ఏపీ ఎస్పీడీసీఎల్ సిఎండి సంతోష్‌రావు, ఎస్ఈ కష్ణారెడ్డి, జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి శంకర్ నారాయణ డిఎంహెచ్ఓ శ్రీహరి తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులు సైన్స్‌పై ఆకర్షితులవ్వాలి : మంత్రి రోజా

ఘనంగా ముగిసిన 30వ రాష్టస్థాయి జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్



ప్రజాశక్తి- గూడూరు రూరల్: తిరుపతి జిల్లా గూడూరులోని ఆదిశంకర కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాస్త్ర సాంకేతిక మండలి ఆధ్వర్యంలో పాఠశాల విద్యాశాఖ, సికే.దాస్ అకాడమీ చారిట బుల్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్, కందుకూరు, ఆదిశంకర కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ, గూడూరు వారి సంయుక్త సహాయసహకారాలతో 30వ బాలల జాతీయ సైన్స్ కాంగ్రెస్ రాష్ట్ర స్థాయి బాలల జాతీయ సైన్స్ కాంగ్రెస్ శాస్త్రీయ ప్రాజెక్ట్ పోటీలను ఘనంగా రాష్ట్ర శాస్త్రసాంకేతిక మండలిసభ్య కార్యదర్శి వై.అపర్ణ శనివారం స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. ఇందులో రాష్ట్రంలోని 26 జిల్లాల నలుమూలల నుంచి విచ్చేసిన బాలశాస్త్రవేత్తలు పాల్గొని రెండు రోజులపాటు శాస్త్రీయ ప్రాజెక్టు పోటీలలో పాల్గొన్నారు. ఆదివారం ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర పర్యాటక, సాంస్కతిక, క్రీడా, యువజన అభ్యున్నతి శాఖ మంత్రి ఆర్కే రోజా విచ్చేసి మాట్లాడారు. 30వ బాలల సైన్స్ కాంగ్రెస్‌కి వచ్చిన బాల శాస్త్ర వేత్తలకు, వారిని తయారు చేసిన ఉపాధ్యాయులకు కార్యక్రమ నిర్వహణలో కీలకపాత్ర పోషించిన ఆంధ్రప్రదేశ్ శాస్త్ర సాంకేతిక మండలి మెంబర్ సెక్రటరీ డాక్టర్ అపర్ణకి, సైన్స్ అండ్ టెక్నాలజీ అధికారులకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. విద్యలేని వాడు వింతపశువు... విద్య ప్రతి ఒక్కరికి అవసరం... విద్యా, వైద్యాన్ని ప్రతి ఒక్కరికి అందించాలనేది లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎన్నోకార్యక్రమాలు చేపట్టారని పేర్కొన్నారు. ఈ జాతీయ బాలల కాంగ్రెస్ సైన్స్ కాంగ్రెస్ ద్వారా 10 నుండి 17 సంవత్సరాల వయస్సుగాల విద్యార్థులే కాక, బాలబాలికలు ఏవరైనా సరే సైన్స్ పట్ల ఆకర్షితులు అవ్వాలనేది ముఖ్య ఉద్దేశమని తెలిపారు. 10 నుండి 15 సంవత్సరాల విద్యార్థులు తమ క్రియేటివీకి పదును పెట్టి దాదాపుగా 182 ప్రాజెక్టులలో 17 ప్రాజెక్టులు ఎంపిక చేయబడిన విజేతలకు అభినందనలు తెలిపారు. పార్టిసిపేట్ చేయడమే విజయానికి మొదటి మెట్టు అని సెలక్ట్ కాబడిన ప్రాజెక్టులను జాతీయ స్థాయికి వెళ్తాయని తెలిపారు. మరింతగా మీ మేధస్సును పదునుపెట్టాలని ఆంధ్రస్టూడెంట్స్ ఆషామాషీ కాదని అద్భుతమైన స్కిల్స్ మీ సొంతమని, ఎడ్యుకేషన్ అంటే క్వాలిఫికేషన్ కాదు క్వాలిటీ అన్నారు.

మార్కుల కోసం తల్లిదండ్రులు కొంతమంది పిల్లల పట్ల ఇబ్బంది గురిచేయడం మనం చూస్తున్నాం. చదవు ముఖ్యం కాని సొసైటీలో ఏలా జీవించాలి, ధైర్యంగా ఎలా వుండాలనేది మరింత ముఖ్యమన్నారు. ప్రతి ఆడపిల్లా ఫ్లవర్ కాదు... ఫైర్... ఆడపిల్లలు కాదు. ఆడపులులు. ఆడపిల్లలకు ఎప్పుడూ సపోర్టుగా వుండాలి. అన్నింటా మనకు షరతులు వుంటాయి. టాలెంట్‌ని నిరూపించుకునే అవకాశాలకు దూరంగా ఉండిపోతారని, ఆడపిల్లల తల్లిదండ్రులు, చూట్టూ వుండే ఫ్రెండ్స్ ఎంకరేజ్ చేయాలన్నారు. తన కుటుంబంలో తల్లిదండ్రులు, నా భర్త, అన్నయ్యలు నాకు ఎప్పుడూ సపోర్ట్‌గా వుండేవారని, ఫ్రెండ్స్‌గా అన్ని విషయాలను షేర్ చేసుకునేవారని అదే తన విజయాలకు కారణం అయ్యాయని తెలిపారు. అనంతరం బాలల సైన్స్ కాంగ్రెస్‌లో 17 ప్రాజెక్ట్‌లకు గాను రాష్ట్రస్థాయిలో గెలిచిన జిల్లా వారీగా విద్యార్థులను అభినందించి బహుమతి, సర్టిఫికెట్, మెడల్‌లు బహూకరించారు. కార్యక్రమంలో ఆదిశంకర కాలేజ్ ఛైర్మన్ పెంచలయ్య, జడ్పీ ఛైర్మన్ అనం అరుణమ్మ, సైన్స్ సిటి డాక్టర్ కె.జయరాం రెడ్డి, ప్రతాప్ రెడ్డి శేఖర్, అప్‌కాస్ట్ సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

బోనుపల్లిలో పారిశుధ్యం పనులు

'ప్రజాశక్తి' వార్తకు స్పందన



ప్రజాశక్తి - శ్రీకాళహస్తి: తొట్టంబేడు మండలంలోని బోనుపల్లి గ్రామంలో ఆదివారం పారిశుధ్యం పనులు చేపట్టారు. కాటేస్తే కంది పోవాల్సిందే అన్న శీర్షికన పల్లెల్లో దోమల బెడదపై శనివారం ప్రజా శక్తిలో కథనం వెలబడింది. స్పందించిన తొట్టంబేడు వైద్యాధికారి రమేష్ ముందుగా మలేరియాతో బాధపడుతూ రమాదేవి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న భూదేవిని పరామర్శించారు. ఆదివారం బోనపల్లిలో పారిశుధ్యం పనులు చేపట్టారు. అన్ని గ్రామాల్లో కూడా దోమల నివారణకు చర్యలు చేపడతామన్నారు.

ఉచిత మెగా ఫెర్టిలిటీ క్యాంప్

ప్రజాశక్తి- తిరుపతి సిటి: మనోహరి సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్, ఐవిఎఫ్ సెంటర్ వారి ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 9 నుంచి ఒంటి గంటల వరకు ఉచిత మెగా ఫెర్టిలిటీ క్యాంపు నిర్వహించినట్లు మనోహరి హాస్పిటల్ అధినేత డాక్టర్ కే. రామచంద్ర తెలిపారు. ఈ ఫెర్టిలిటీ క్యాప్‌లో తిరుపతి మరియు చుట్టుపక్క ప్రాంతాల ప్రజలు పాల్గొన్నారు. డాక్టర్ కె.రామచంద్ర మాట్లాడుతూ ఆదివారం మొట్టమొదటిసారిగా తిరుపతిలో ఉచిత ఫెర్టిలిటీ క్యాంపు నిర్వహించడం జరిగిందన్నారు. సంతానం లేని వారికి సంతానం కలగని వారికి వారి సమస్యలు పరిష్కరించి సంతానం కలిగేలా, ఉచితంగా కన్సల్టేషన్, సిమెన్ ఎనాలసిస్, ఫ్రీ అల్ట్రా సౌండ్ స్కానింగ్, రక్త పరీక్షలందు 50శాతం ఉచితంగా నిర్వహిస్తున్నామన్నారు. సంతానం లేని వారికి ఐవిఎఫ్ ట్రీట్మెంట్ ద్వారా సంతాన ఉత్పత్తి కలిగిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ హర్ష, డాక్టర్ మనోహరి, డాక్టర్ అచ్యుత, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

13న బహిరంగ వాహనాలకు వేలం

ప్రజాశక్తి-పుత్తూరుటౌన్: ఈ నెల 13న పుత్తూరు సెబ్ స్టేషన్‌లో బహిరంగంగా వాహనాలు వేలం జరుగుతుందని పుత్తూరు స్పెషల్ ఎన్ఫోర్స్‌మెంట్ బ్యూరో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కృష్ణా తెలిపారు. సెబ్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ పుత్తూరు డివిజన్ పరిధిలోని ఉన్న సెబ్ కార్యాలయంలో ఉన్న వాహనాలను డివిజన్ పరిధిలోని సెబ్ స్టేషన్లో ఎక్సైజ్ నేరంలో పట్టుబడ్డ వివిధ వాహనాలు వేలం వేయడం జరుగుతుందని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ధారావత్ చెల్లించి వేలంలో పాల్గొనవచ్చునని ఆయన కోరారు. వేలంలో పాల్గొనదలచిన వారు ఆధార్ కార్డు, పాన్ కార్డు జిరాక్స్ కాపీలను సమర్పించి వేలంలో పాల్గొనాలని ఆయన తెలిపారు.

శ్రీవిద్యకు డాక్టరేట్ ప్రదానం



ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వ విద్యాలయం వాణిజ్య శాస్త్ర విభాగానికి చెందిన పరిశోధక విద్యార్థి శ్రీవిద్యకు శ్రీ వేంకటేశ్వర విశ్వ విద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి ఎమ్.దామ్లా నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. కామర్స్ విభాగపు ఆచార్య జయచంద్రారెడ్డి మార్గదర్శ కత్వంలో "ఫైనాన్షియల్ పెర్ ఫార్మెన్స్ ఆఫ్ సెలెక్ట్ సెంట్రల్ పబ్లిక్ సెక్టార్ ఎంటర్ ప్రైజస్ ఇన్ ఇండియా" అనే అంశంపైన పరిశోధనా గ్రంథాన్ని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంకు సమర్పించినట్లు వెల్ల డించారు. శ్రీవిద్యకు డాక్టరేట్ అవార్డు రావడం పట్ల పలువురు ఆచా ర్యులు, పరిశోధకులు, బంధుమిత్రులు అభినందనలు తెలిపారు.

పారిశుధ్య పనులు వేగవంతం



ప్రజాశక్తి -బాలాయపల్లి: తుపాను కారణంగా గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్య పనులు వేగవంతం చేయాలని ఎంపీడీవో వినీల్ కుమార్ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని వెంకటరెడ్డిపల్లి, కయ్యూరు తదితర గ్రామాల్లో పారిశుధ్య పనులను పరిశీలించారు. కాచిని నీటినే తాగేలా అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ మోహన్‌రాజు, పంచాయతీ కార్యదర్శి రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గుణశేఖర్‌కు ఉత్తమ అధ్యాపక అవార్డు



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: పద్మావతి మహిళా విశ్వ విద్యాలయం సెమినార్ హాల్‌లో ఎస్ఆర్‌కే సొసైటీ వారు నిర్వహించిన సదస్సులో నారయ ణవనం మండలం బ్రాహ్మణ తాంగేల్‌కు చెందిన డాక్టర్ గుణశేఖర్ ఉత్తమ అధ్యాపక అవార్డు అందుకున్నారు. గుణశేఖర్ రసాయన శాస్త్రం అధ్యా పకుడిగా సేవలందిస్తున్నారు. గత కొన్నేళ్లుగా విద్యను బోధిస్తూ విలువలతో కూడిన సమాజాన్ని నిర్మించాలని విద్యార్థులను ప్రోత్స హిస్తున్నారు. ఇందుకు గుర్తించి గుణశేఖర్‌కు ఉత్తమ అధ్యాపక అవార్డును అందించారు.

పోలీసులు అప్రమత్తంగా ఉండాలి



ప్రజాశక్తి-బాలాయపల్లి: మండలంలోని నిండలి గ్రామ సమీపం వద్ద ఉన్న కైవల్య నది వద్ద పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పా టు చేయాలని తహసీల్దారు అజ్మితుల్లాఖాన్ అన్నారు. ఆదివారం ఇండల గ్రామ సమీపం వద్ద ప్రవహిస్తున్న వరదనీటి ప్రవాహాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తలారి కైవల్య నది వద్ద ఉంటూ ప్రయాణికులు నీటిలో దిగకుండా ఉండేలా ప్రత్యేకమైన చర్యలు చేపట్టాలన్నారు. ఇటువైపు రాకపోకలు జరగకుండా ఉండాలని సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై సుధాకర్‌రెడ్డి, మండల శాఖ అధికారులు పాల్గొన్నారు.

'అరణియార్'ను టూరిజం ప్రాజెక్టుగా మారుస్తాం..!



ప్రజాశక్తి-పిచ్చాటూరు: అరణియార్ ప్రాజెక్ట్‌ను టూరిజం ప్రాంతం మారుస్తామని ఎమ్మెల్యే ఆదిమూలం అన్నారు. ఆదివారం అరణియార్ ప్రాజెక్టు గేట్ల వద్ద ఎమ్మెల్యే చేతుల మీదుగా గంగమ్మకు జలహారతి ఇచ్చి పూజలు నిర్వహించారు. అరణియార్ ప్రాజెక్టులో 29 అడుగుల నీటిమట్టం చేరడంతో సైరన్ మోగించి ఓ గేటు నుంచి 300 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఎమ్మెల్యే ఆదిమూలం మాట్లాడుతూ ప్రాజెక్టును జగనన్న ప్రభుత్వ చొరవతో టూరిజం ప్రాజెక్టుగా మారుస్తామని.. తుపాన్ కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామాలలో రోడ్లు, విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగితే వెంటనే పునరుద్ధరించాలని అధికారులను ఆదేశించారు. తుపాను తాకిడికి నష్టపోయిన వారిని ప్రభుత్వం ఆదుకుంటుందని.. ఏ ఒక్కరూ ఆందోళన చెందాల్సిన పనిలేదని ప్రజలకు భరోసా కల్పించారు, జగనన్న ప్రభుత్వం ప్రజలకు అండగా ఉంటుందని.. ప్రాజెక్టు ద్వారా మత్స్యకారులకు, రైతులకు అన్ని సదుపాయాలు సమకూరుస్తామన్నారు. తహసీల్దారు మధుసూదన్‌రావు, ఎంపీడీవో శ్రీనివాసులు, ఇరిగేషన్ ఏఈ లోకేష్, సీఐ సురేష్ కుమార్, ఎస్సై శ్రీకాంత్ రెడ్డి, పిచ్చాటూరు మండలం వైసీపీ అధ్యక్షులు కేటీ హరిశ్చంద్రారెడ్డి, సర్పంచ్ రోస్‌రెడ్డి, చలపతి రాజు, పాలపద్మనాభం, మోహన్, తొప్పయ్య, త్యాగరాజు, వెంకటేష్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రంథాలయ అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే వెంకటే గౌడ

ప్రజాశక్తి - వీకోట : మండల కేంద్రమైన వీకోటలోని శాఖ గ్రంథాలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని పలమనేరు ఎమ్మెల్యే వెంకటే గౌడ తెలిపారు. ఆదివారం వారు ఆకస్మికంగా గ్రంథాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు పలు సమస్యలను వారి దృష్టికి తీసుకురాగా మౌలిక సదుపాయాల కల్పనతో పాటు పాఠకుల సంఖ్య పెంచేందుకు తగు సూచనలు చేశారు. మండలంలో పెరుగుతున్న విద్యార్థు లకు అనుగుణంగా పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలు అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు.

పడకేసిన పారిశుధ్యం

- రోగాల బారిన గ్రామీణ ప్రజలు
- అధికారుల చర్యలు అంతంతమాత్రం

ప్రజాశక్తి-బాలాయపల్లి: యాచవరం దళితవాడలో పారిశుధ్యం పడకేసింది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా మరింత దారుణంగా మారింది. ప్రజలు కష్టాలు పడుతున్నా అధికారుల చర్యలు అంతంత మాత్రంగా ఉంది. మండల కేంద్రానికి కూతవేటు దూరంలో గ్రామం ఉన్నా.. పారిశుధ్యం అధ్వానంగా ఉన్నా పట్టించుకోకపోవడం దారుణం. గత మూడు నెలలు నుంచి వర్షాలు ప్రారంభమయ్యాయి. ఎండా కాలంలో చెత్తా, చెదారంతో నిండిన మురుగునీటి కాలువలు వర్షాలకు పొంగి పొర్లుతున్నాయి. దీంతో దుర్వాసన వెదజల్లుతోంది. మరోవైపు అంటువ్యాధులు సోకి ఆసుపత్రి పాలవుతు న్నారు. తాగునీటి కుళాయిలు మురుగునీటిలో ఉండటంతో ఆ నీరు తాగడం కారణంగా ప్రజలు రోగాల బారిన పడి ఆసుపత్రి పాలవుతున్నారని పలువురు వాపోతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఎటు చూసినా మురుగు నీరే

వర్షం నీరు వెళ్లేందుకు వీలు లేదు. మురుగు వాసన కారణంగా ఇళ్లల్లో భోజనం చేయలేని పరిస్థితి. వర్షం



ఇళ్ల మధ్య చేరిన మురుగునీరు



నీటితో మురుగు నీటి కాలువ నిండి వరదలై పారుతోంది. అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. పంచాయతీ అధికారులకు చెప్పినా తూతూమంత్రంగా చేసి చేతులు దులుపుకుంటున్నారు. శాశ్వత పరిష్కారం చేపట్టాలి. మురుగునీరు ఇళ్ల మధ్య ఉండటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

జ్వరాలతో ఆసుపత్రికి పరుగులు

జ్వరాలతో ప్రజలు బాధపడుతున్నారు. పారిశుధ్య లోపం, నీరు నిల్వ ఉండటమే ప్రధాన కారణం. వాతావరణ మార్పులతో విషజ్వరాలు వ్యాపించి ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలకు గ్రామాల్లో పెద్ద ఎత్తున మురుగు నిల్వ ఉంటోంది. ఎక్కడికక్కడ మురుగునీటి ఉద్ధృతి వల్ల విపరీతంగా దోమల సంఖ్య పెరుగుతోంది. గ్రామాల్లో సరైన పారిశుధ్య వ్యవస్థ లేక అంటువ్యాధులతో అవస్థలు ఇళ్ల సముదాయాల్లోనే పెద్దఎత్తున మురుగు నిల్వ ఉంటోంది. ఇంటిలోకి వెళ్లాలంటే మురుగు నీరులో నడవాల్సిందే. గ్రామాల్లో కాలువలు, నీటి గుంటలు, ఇతర ప్రాంతాల్లోని నీరు నిలువడంతో దోమలు క్రిమి, కీటకాలు వ్యాపించి వివిధ వ్యాధులకు కారణమవు తున్నాయి. ఈ సీజన్‌లో మలేరియా, టైఫాయిడ్, డయేరియా, చికున్‌గున్యా లాంటి వ్యాధులు ఇక్కడి ప్రజలపై ప్రభావం చూపుతున్నాయి.

పట్టించుకోవడం లేదు: తోకాల రమణమ్మ యాచవరం



గత మూడు నెలల నుంచి అడపాదడపా వర్షాలు వస్తు న్నాయి. ఇళ్ల మధ్య మురుగు నీరు నిలిచి దుర్గంధమైన వాసన వస్తుంది. అధికారులు కానీ ప్రజా ప్రతినిధులు కానీ పట్టించు కోవడం లేదు. అంటూ వ్యాధులు వస్తున్నాయి. ఇకనైనా అధికారులు స్పందించి పారిశుధ్య పనులు చేపట్టాలి.

రాత్రి అయితే దోమలు



రాత్రి అయితే దోమలు అధికంగా ఉన్నాయి. ఈ దోమల వల్ల జ్వరాలు వచ్చి ఆసుపత్రిలో చుట్టూ తిరుగు తున్నాం. గ్రామంలో అధికంగా జ్వరాలతో అలమటిస్తు న్నారు. ప్రయివేట్ ఆసుపత్రులే తమకు దిక్కు అని వాపోయారు.

- చిత్తూరు పెంచలయ్య యాచవరం

పారిశుధ్య పనులపై దృష్టి సారిస్తున్నాం

గ్రామ పంచాయతీల్లో పారిశుధ్య పనులు సిబ్బందితో ఎప్పటికప్పుడు చేయిస్తున్నాం. అంటువ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. వర్షాల కారణంగా పారిశు ధ్యం లోపించడంతో పాటు చర్యలు తీసుకోవడం జరుగుతుందని చెప్పారు.

- వినిల్ కుమార్ ఎంపీడీఓ బాలాయపల్లి

17న షటిల్ క్రీడా పోటీలు ప్రారంభం



ప్రజాశక్తి-గూడూరు రూరల్: ఈనెల 17, 18వ తేదీలలో తీన్మార్ షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నట్లు ది యంగ్ గూడూర్ షటిల్ బాడ్మింటన్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు చేవూరు విజయ్ మోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం గూడూరు పట్టణం లోని పీఆర్ గ్రానైట్ సమీపంలోని హెచ్‌డీ బ్యాడ్మింటన్ ఎరీనా ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కరోనా వలన రెండేళ్లపాటు షటిల్ పోటీలను నిర్వహించలేకపోయా మన్నారు. వైజీఎస్బీఏ ఆధ్వర్యంలో ఎటువంటి వసతులు లేనిసమయంలోనే గూడూరులో పట్టణ, జిల్లా, రాష్ట్ర, దేశ స్థాయిలో బాడ్మింటన్ క్రీడా పోటీలను ఎంతో ఘనంగా నిర్వహించామని గుర్తు చేశారు. హర్ష, దీపుల చొరవతో జాతీయ స్థాయి ప్రమాణాలు కలిగిన ఇండోర్ స్టేడియం ఏర్పాటైందన్నారు. దీనికిగాను హర్ష, దీపులను క్రీడాకారుల తరపున అభినందిస్తున్నామన్నారు. డిసెంబర్ 17, 18న జాతీయ, రాష్ట్ర స్థాయిలలో రాణించిన స్థానిక క్రీడాకారులతో తీన్మార్ షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు, అలాగే నియోజకవర్గ స్థాయి క్రీడాకారులతో మరొక విభాగం, జాతీయ, రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయిలో రాణించిన క్రీడాకారులు, స్థానిక క్రీడాకారులతో కలిసి మరొక విభాగం మొత్తం మూడు విభాగాలలో తీన్మార్ షటిల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్రీడాకారులు 18వ తేదీ ఆదివారం 9-30 గంటలకు హెచ్ డీ ఎరీనా స్టేడియంకు చేరుకోవాలని కోరారు. అదేవిధంగా ఈ నెల 24, 25 తేదీలలో ఇంటర్ స్టేట్, జనవరిలో నిర్వహించనున్న జాతీయ స్థాయి పోటీల నిర్వహణకు పట్టణ ప్రముఖులు దాతలుగా వ్యవహరించి క్రీడా పోటీలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. వైజీఎస్బీఏ అధ్యక్షులు షేక్. జమాలుల్లా మాట్లాడుతూ 24, 25 తేదీలలో ఇంటర్ స్కూల్ షటిల్ టోర్నమెంట్ ను గూడూరు, నాయుడు పేట డివిజన్ స్థాయిలలో బాలుర, బాలికల విభాగాలలో నిర్వహించ నున్నట్లు తెలిపారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో నిరుపేద క్రీడాకారులకు శిక్షణ ఇచ్చి జాతీయ స్థాయిలోరాణించేలా కషి చేస్తున్నామని తెలిపారు. అసోసియేషన్ ఉపాధ్యక్షులు షేక్. అబ్దుల్ కలామ్ మాట్లాడుతూ జనవరి 20వ తేదీ పైన వైజీఎస్బీఏ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలను నిర్వహించేందుకు నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. 18న నిర్వహించే తీన్మార్, 24, 25 తేదీలలో నిర్వహించనున్న ఇంటర్ స్కూల్, జనవరిలో నిర్వహించనున్న జాతీయ స్థాయి షటిల్ పోటీలను పట్టణ క్రీడాకారులు, క్రీడా భిమానులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో వైజీఎస్బీఏ సభ్యులు చేవూరు విజయ్ మోహన్ రెడ్డి, హెచ్ డీ ఎరీనా స్టేడియం నిర్వాహకులు హర్షవర్ధన్ రెడ్డి, షేక్ జమాలుల్లా, షేక్. అబ్దుల్ కలాం, కోదండపాణి, వల్లూరు రమేష్, పీఆర్ గ్రానైట్ ప్రభాకర్, మల్లికార్జున్ రావు, సునీల్, ఇంతియాజ్ (మాస్టర్), రూపేష్, సాధిక్, ఆఖిల్, అతిక్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను రద్దు చేసిన వైసీపీ

నగరి టీడీపీ ఇన్‌ఛార్జి గాలి భానుప్రకాష్



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల సంక్షేమం కోసం తెలుగుదేశం ప్రభుత్వంలో అమలు చేసిన పథకాలన్నీ వైసీపీ రద్దు చేసిందని.. వారికి అన్యాయం చేసిందని నగరి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జి గాలి భానుప్రకాష్ అన్నారు. ఆదివారం పుత్తూరు మున్సిపాలిటీ ఆరో వార్డులో రాష్ట్ర తెలుగుదేశం పార్టీ వాణిజ్య విభాగం ఉపాధ్యక్షులు డి.ఎస్.గణేష్ ఆధ్వర్యంలో వైసీపీ పాలనలో 'ఇదేం ఖర్మ.. మన రాష్ట్రానికి' కార్యక్రమం నిర్వహించారు. ఆదరణ, కార్పొరేషన్ సబ్సిడీ రుణాలు, అన్న క్యాంటీన్, ఆంక్షలు లేని దుల్హన్ పథకం, పెళ్లి కానుక, చంద్రన్న బీమాలాంటి పథకాన్నీ తెలుగుదేశం అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేసి ఆర్థిక సాయం అందించి ఆదుకుంటామని పేర్కొన్నారు. తెలుగుదేశం హయాంలో వేసిన రోడ్లు, ఎల్ఈడీ బల్బులు తప్ప.. ఈ ప్రభుత్వంలో ఒక్క అభివద్ధి చేయలేదని తెలిపారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర వాణిజ్య విభాగ ఉపాధ్యక్షులు డీఎస్ గణేష్. టీడీపీ రాష్ట్ర మీడియా అధికార ప్రతినిధి డీజీ ధనపాల్. పట్టణ అధ్యక్షులు గాలి జీవరత్నంనాయుడు, ప్రధాన కార్యదర్శి ఎస్ ఎస్ ధనపాల్, మైనారిటీ రాష్ట్ర నాయకులు ఖాజాఫీర్, మైనారిటీ అధ్యక్షులు నాయకులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిక

పట్టణంలోని గేటు పుత్తూరు చెందిన ముస్లిం మైనారిటీ సోదరులు వైసీపీ నుంచి తెలుగుదేశం పార్టీ నగరి నియోజకవర్గ ఇన్చార్జి గాలి భాను ప్రకాష్ అధ్యక్షతన ఎస్ మున్నా, ఎస్ జైలయస్ ఆఫ్సార్ సోదరులకు కండువా కప్పి టిడిపిలో చేరారు. ముస్లిం మైనారిటీ మహమ్మద్ రఫీ, హమీద్ భాషా, రాష్ట్ర మైనారిటీ నాయకులు ఖాజాపూర్, తురబ్ డిఎస్ గణేష్, డిజీ ధనపాల్, గాలి జీవరత్నం నాయుడు, ఎస్ఎస్ ధనపాల్, ముస్లిం మైనార్టీ సోదరులు టీడీపీ కార్యకర్తలు మహిళలు పాల్గొన్నారు.

నెలరోజుల్లో కోటలో ఆక్రమణలు తొలగిస్తాం

- గూడూరు ఆర్డీవో కిరణ్ కుమార్




ప్రజాశక్తి-కోట: కోట పట్టణంలో ఆక్రమణల కారణంగా రోడ్లపై వర్షపునీరు, డ్రైనేజీ నీరు చేరడంతో రోడ్లన్నీ నాశనమవుతూ రోడ్లు గుంతలమయంగా మారుతు న్నాయి. పట్టణంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తడంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కోట పట్టణంలో నోటీసులు అందుకున్న ఆక్రమణదారులు స్వచ్ఛందంగా ఆక్రమణలు తొలగించి కోట అభివద్ధికి సహకరించాలని గూడూరు ఆర్డీవో కిరణ్ కుమార్ కోరారు. ఆదివారం కోట పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి ఆర్డీవో చేరుకుని నిరాశ్రయులకు సరుకులు, బియ్యం, దుప్పట్లు అందించారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కోటలో రోడ్లు దారుణంగా ఉన్నాయని..ఆక్రమణదారులే ఇందుకు కారణమన్నారు. ఇటీవల కోట పట్టణంలో ఉన్న 303 మందికి నోటీసులు జారీ చేయడం జరిగిందని తెలిపారు. ఆక్రమణదారులతో కోట పంచాయతీ కార్యాలయంలో ఇటీవల అధికారులు సమావేశం నిర్వహిస్తే 90 శాతం మంది మద్దతు ఇచ్చార న్నారు. ఆక్రమణలు తొలగించేందుకు ఎలాంటి ఇబ్బందులు లేవని తెలిపారు. ఆక్రమణదారులు నష్టపోకుండా ఉండేందుకు స్వచ్ఛందంగా తొలగించుకోవాలన్నారు. ఆర్అండ్‌బీ అధికారులు మార్క్ చేసిన వరకు తొలగించేలా చర్యలు తీసుకుంటామని.. ఎవరికీ మినహాయింపులు ఉండవని తెలిపారు. తహసీల్దార్ పద్మావతి, డీఈ అరుణకుమారి, ఎంపీడీవో భవానీ, వీఆర్‌వో రమణయ్య, రెవెన్యూశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రామచంద్రయాదవ్ నోరు అదుపులో పెట్టుకోవాలి

జిల్లా వైసీపీ ప్రధాన కార్యదర్శి గోపి యాదవ్



ప్రజాశక్తి-బిఎన్‌కండ్రిగ : జనసేన నాయకుడు రామచంద్రయాదవ్ నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని.. రాష్ట్రంలో రాజకీయ పరిస్థితులపై అవగాహన లేని నీకెందుకు రాజకీయమని తిరుపతి జిల్లా వైసీపీ ప్రధాన కార్యదర్శి గోపి యాదవ్ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని రాజకీయంగా ఎదుర్కోలేక బీసీ కులాన్ని అడ్డు పెట్టుకుంటున్న రామచంద్రయాదవ్ జాగ్రత్తగా ఉండాలని.. కపట రాజకీయాలు తగవని.. అసలు నీకెందుకు రాజకీయమన్నారు. పబ్లిక్ స్థలాల్లో రాజకీయ ర్యాలీలు నిర్వహించాలంటే పోలీస్, రెవెన్యూ అనుమతులు తీసుకోవాలని.. లేకుంటే లాఠీఛార్జ్ చేసి లాకప్‌లో వేస్తారని.. ఆమాత్రం తెలియని నీకెందుకు రాజకీయమని ఎద్దేవా చేశారు. తమ నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో ఎమ్మెల్యేగా గెలిచిన అమరనాథరెడ్డికి కులాన్ని విమర్శించే అర్హత.. ధైర్యం లేదన్నారు. ప్రజలకు సేవ చేయకుండా అసత్య వ్యాఖ్యలు చేయడం మాట్లాడటం మంచి పద్ధతి కాదని.. అసలు మాట్లాడే అర్హత జీవీఎల్ నరసింహకు లేదని పేర్కొన్నారు. యాదవ సమాజాన్ని పక్కదోవ పట్టిస్తున్న జనసేన నాయకుడు రామచంద్ర యాదవ్ ఓ పిరికిపందగా అభివర్ణించాడు.



కేర్ డయాగ్నోస్టిక్ కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-గూడూరు : పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా ఉన్న కేర్ డెంటల్ ఆసుపత్రిలో కేర్ డయాగ్నోస్టిక్ కేంద్రాన్ని కోట మండలం చెందోడు పంచాయతీ వైసీపీ యువ నాయకులు చిల్లకూరు సాయిప్రసాద్ రెడ్డి చేతులు మీదుగా ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా చిల్లకూరు సాయిప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ ఈ కేర్ డయాగ్నోస్టిక్ కేంద్రాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కేఎస్ఆర్ ఆక్వా సీఫుడ్ కంపెనీ ప్రతినిధులు కే.నాగరాజు, వాసు, తదితరులు పాల్గొన్నారు.

నూతన బాధ్యతల స్వీకరణ



ప్రజాశక్తి-దక్కిలి: జిల్లా వ్యాప్తంగా బదిలీలో భాగంగా తిరుపతిలో విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ నాగరాజు దక్కిలి మండల ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న నరసింహారావు తిరుపతికి బదిలీపై వెళ్లారు. ఉన్నతాధికారుల ఆదేశాలను అనుసరించి మండలంలో శాంతిభద్రతలపై ప్రత్యేక దష్టి సారిస్తామన్నారు. చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే సహించేది లేదని.. కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

వైసీపీ కార్యకర్త మృతికి సంతాపం

ప్రజాశక్తి-పుత్తూరుటౌన్: పరమేశ్వర మంగళం లోని వైసీపీ కార్యకర్త రాము మృతి చెందడంతో ఆదివారం రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా సోదరులు రాంప్రసాద్ రెడ్డి గ్రామానికి చేరుకుని రాము భౌతిక కాయానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో పుత్తూరు మండలాధ్యక్షురాలు మునివేలు, ఏఎంసీ ఛైర్మన్ భాస్కర్ యాదవ్, సర్పంచ్ మల్లిక, హరీష్, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం



ప్రజాశక్తి- రేణిగుంట: పట్టణంలోని వేణు గోపాలపురంలో ఆదివారం బి.ఎం.ఎస్.ఆర్ సేవాదళ్ ఆధ్వర్యంలో మినరల్ వాటర్ ప్లాంట్‌ను వైసీపీ మండల ఇన్‌ఛార్జి పవిత్రారెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో రేణిగుంట మండల ఎంపీపీ హరిప్రసాద్‌రెడ్డి, జెడ్పీటీసీ సంధ్యారాణి, వైస్ ఎంపీపీ సుజాత, పట్టణ అధ్యక్షులు ప్రభాకర్, ఉప సర్పంచ్ ఇర్ఫాన్, వార్డు మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

నీట మునిగిన గ్రామాలు



ప్రజాశక్తి-తడ: తడ మండలంలో మాండూస్ తుపాన్ కారణంగా కురిసిన భారీ వర్షాలకు కాళంగి నది, పాముల కాలువకు వరద నీరు వచ్చి ఉప్పొంగడంతో మండలంలోని కొన్ని వేల ఎకరాలు నీట మునిగాయి. అలాగే మండలంలోని పలు గ్రామాలు కాదలూరు, గ్రద్దగుంట, పులివేంద్ర, మరికొన్ని గ్రామాలు వరద కారణంగా నీట మునిగాయి. మాండూస్ తుపాన్ తీరం దాటే సమయంలో గాలులు బలంగా వీయడంతో చలి తీవ్రత పెరిగి ప్రజలు ఇబ్బంది పడ్డారు. రైతులు నీట మునగడంతో వరి పంట దెబ్బతింటుందని ఆందోళన చెందుతున్నారు.



ఎమ్మెల్సీ ఎన్నికల్లో నకిలీ ఓట్లను తొలగించాలి

ప్రజాశక్తి-పాకాల: ఎమ్మెల్సీ ఎన్నికల్లో నకిలీ ఓట్లను తొలగించాలని బీటీపీ మండలాధ్యక్షులు జ్యోతిప్రసాద్ అన్నారు. స్థానిక ఎన్వీఎన్ ప్రాథమిక పాఠశాలలో ఆదివారం బీటీపీ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తూర్పు రాయలసీమ నియోజకవర్గమైన చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం జిల్లాలలో గ్రాడ్యుయేట్ ఉపాధ్యాయ ఓటర్ల నమోదులో ఎన్నికల కమిషనర్ నిబంధనలకు విరుద్ధంగా వేలాదిగా ఓటర్లను నమోదు చేస్తున్నారన్నారు. నిబంధనలు లేకుండా నమోదైన ఓటర్లను పరిశీలించి వెంటనే తొలగించి ప్రజా స్వామ్యాన్ని కాపాడుకోవాలన్నారు. బీటీపీ రాష్ట్ర ముఖ్య సలహాదారు గుండ్లపల్లి ఆంజనేయులు, జిల్లా అధ్యక్షులు రామచంద్ర, ప్రధాన కార్యదర్శి రామమూర్తి, మండల నాయకులు కష్ణమూర్తి, జయబాల, విజయ మోహన్, రామచంద్ర, ఆదికేశవులు, రామకష్ణ, గోపాలయ్య, తులసీరామ్, రాజేంద్రుడు, గోపి, వెంకటయ్య, శివప్రసాద్ పాల్గొన్నారు.

'మంత్రి పెద్దిరెడ్డిపై ఆరోపణలు చేస్తే ఊరుకోం'



ప్రజాశక్తి-రేణిగుంట: యాదవులను గుర్తించింది వైసీపీ ప్రభుత్వమేనని.. 50 శాతం వివిధ పదవుల్లో యాదవులు ఉన్నారని రేణిగుంట మండల యాదవుల సంఘం ప్రతినిధులు అన్నారు. ఆదివారం రేణిగుంట పట్టణంలో సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. డిసెంబర్ 6న రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై బోడే రామచంద్రయ్య యాదవ్ అసత్య ఆరోపణలు చేయడం తగదన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌యాదవ్, విశ్వనాథ్ యాదవ్ మాట్లాడుతూ పుంగనూరు నియోజకవర్గానికి చెందిన బోడె రామచంద్రయ్య యాదవ్ వ్యాపారుడిగా ఉంటూ జనసేన నాయకుడిగా వ్యవహరిస్తున్నారన్నారు. ఆయన ఇంటిపై మంత్రి రామచంద్రారెడ్డి దాడి చేశారని తప్పుడు ఆరోపణలు చేయడం సబబు కాదన్నారు. రాజకీయ లబ్ధి కోసం దిగజారుడు ప్రకటనలు చేయడం పద్ధతి కాదన్నారు. వైసీపీ వచ్చిన తర్వాత యాదవులకు పెద్దపీట వేసిందని తెలిపారు. కార్యక్రమంలో పీడీ బాబుయాదవ్, సునీల్‌యాదవ్, భూపతి యాదవ్, శ్రీరామ్‌యాదవ్, చిట్టిబాబు యాదవ్, కష్ణ యాదవ్, దీనా యాదవ్, దిలీప్ యాదవ్, చెంగయ్యయాదవ్ పాల్గొన్నారు.

తుపాను బాధితులకు సాయం



ప్రజాశక్తి-గూడూరు రూరల్: తుపాన్ ప్రభావంతో ఎక్కడా ప్రాణనష్టం జరుగకుండా అప్రమత్తంగా ఉంటూ సేవలం దించిన ఆర్డీవో, రెవెన్యూ సిబ్బందిని గూడూరు నియో జకవర్గ ఎమ్మెల్యే వరప్రసాద్ అభినందించారు. గూడూరు ఎమ్మెల్యే వరప్రసాద్ మాట్లాడుతూ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనంతో గత మూడు రోజులుగా నియోజకవర్గ వ్యాప్తంగా భారీ వర్షాలు కురిశాయని.. తుపాన్ కారణంగా దెబ్బతిన్న గహాలకు ప్రభుత్వం రూ.5 వేలు ఆర్థిక సాయం, దుస్తులు కొనుగోలుకు రూ.1500 పరిహారం ప్రభుత్వం చెల్లిస్తుందని తెలిపారు. గూడూరు ఆర్డీవో కిరణ్‌కుమార్ రాత్రీపగలు అప్రమత్తంగా ఉంటూ సిబ్బందికి సూచనలు ఇస్తూ డివిజన్ పరిధిలో ఎక్కడా విపత్కర పరిస్థితులు జరుగకుండా జాగ్రత్తలు తీసుకున్నారని ఆయన సేవలను కొనియాడారు. ఆర్డీవోతోపాటు రెవెన్యూ సిబ్బందికి నియోజకవర్గ ప్రజల తరపున అభినందనలు తెలియజేశారు.



పుత్తూరుటౌన్: పుత్తూరు మండలం వేపగుంట దళిత వాడలో మాండూస్ తుపాన్ కారణంగా గోవిందమ్మకు చెందిన పూరిల్లు పడిపోవడంతో ఆదివారం రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్.కె. రోజా సోదరులు రామ్ ప్రసాద్ రెడ్డి గ్రామానికి చేరుకుని పరామర్శించారు. ఈ సందర్భంగా బాధితురాలికి బియ్యం, నూనె, కందిపప్పు, కూరగాయలతోపాటు రోజా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో పుత్తూరు మండలాధ్యక్షురాలు మునివేలు, తహసీల్దారు రవి. ఏఎంసీ ఛైర్మన్ భాస్కర్ యాదవ్, సర్పంచులు గిరిజా ప్రసాద్, గోవిందస్వామిరెడ్డి, వైఎస్ఆర్ సీపీ నాయకులు నరసింహులు, బుజ్జి, లక్ష్మణమూర్తి పాల్గొన్నారు.

రాకపోకలకు అవాంతరాలు లేకుండా చూడాలి



ప్రజాశక్తి-బాలాయపల్లి : రామాపురం, కడగుంట, నిండలి గ్రామాలకు రాకపోకలకు ఎలాంటి అవాంతరాలు లేకుండా చర్యలు చేపట్టాలని మండల ప్రత్యేకాధికారి, రోడ్లు భవనాలశాఖ డీఈ సత్యనారాయణ సూచించారు. ఆదివారం కడగుంట-బాలాయపల్లి మార్గంమధ్యలో ఉన్న కైవల్య నదిపై నిర్మించిన తూముల వద్ద వర్షపు నీరు ఎటు వెళ్లకుండా ఉండటంతో జేసీబీతో ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిండలి - వెంకటరెడ్డిపల్లి మార్గంమధ్యలో ఉన్న కైవల్యానది తూముల వద్ద నీరు పారుతోంది. వాహనదారులు అటు వైపు రాకుండా ఉండాలని.. సచివాలయ సిబ్బందిని ఏర్పాటు చేయాలని ఎంపీడీవో వినీల్ కుమార్‌ను ఆదేశించారు. తొందరపడి ప్రయాణం సాగిస్తే ప్రాణాపాయం జరిగే ప్రమాదం ఉందన్నారు. పోలీసు వ్యవస్థ ప్రత్యేకంగా చర్యలు తీసుకోవాలని ఎస్సై సుధాకర్‌రెడ్డిని ఆదేశించారు. పంట నష్టం పై ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని తహసీల్దారుకు సూచించారు.

జీవీఎస్ బాబుకు ఫెలోషిప్ అవార్డు

ప్రజాశక్తి-రొంపించెర్ల: రొంపిచెర్ల మండలా నికి చెందిన డాక్టర్ జీవీఎస్ బాబుకు భారతీయ దళిత సాహిత్య అకాడమీ న్యూఢిల్లీ వారి ఆధ్వర్యంలో బాబాసాహెబ్ డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ నేషనల్ ఫెలోషిప్ అవార్డు అం దించారు. బాలలు, స్త్రీల హక్కుల కోసం కృషి చేయడంతో బాబాసాహెబ్ డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ నేషనల్ ఫెలోషిప్ అవార్డు దక్కింది.